
ప్రజాశక్తి

శనివారం 20 సెప్టెంబర్ 2025

5

పార్వతీపురం మన్యం



జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) కు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బి.సోంబోర శుక్రవారం తెలిపారు. ఖోఖో సీనియర్, జూనియర్ 4, కబడ్డీ సీనియర్స్, జూనియర్స్ 4, వాలీబాల్ 1, క్రికెట్ 9, సిమ్మింగ్ 5, అథ్లెటిక్స్ 1 చొప్పున విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు ఈనెల 20 నుంచి శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాలలో జిల్లాస్థాయి పోటీలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల ఎంపిక పట్ల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, అభినందనలు తెలిపారు.

బస్సులు పెంచరా?

- ఆక్యుపెన్సీ రేషియో పెరిగినా అవే బస్సులు
- స్త్రీ శక్తి అమలు తర్వాత ప్రయాణికులకు తప్పని అగచాట్లు
- ఉచిత ప్రయాణానికి నోచుకోని గ్రామాలెన్నో

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి విజయవంతమైందనే ఆనందం ఒకవైపు కనిపిస్తోంది. మహిళలు ఉత్సాహంగా ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకుంటున్నారనే ఫీడ్ బ్యాక్ ప్రభుత్వానికి అందుతోంది. అయితే ఈ పథకం అమలు తర్వాత ప్రయాణీకులకు సరికొత్త కష్టాలు మొదలయ్యాయి. ఈ పథకం అమలు కాకముందున్న పరిస్థితుల కంటే అమలైన తర్వాత పరిస్థితులు ఆర్టీసి యాజమాన్యానికి, ప్రయాణీకులకు తలనొప్పిగా మారాయి. ఈ పథకం అమలు చేసిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో గణనీయంగా పెరిగింది. ఉచిత ప్రయాణమే లక్ష్యంగా మహిళలు ఎక్కువగా దీన్ని వినియోగించుకుంటున్నారు. ఆగష్టు 15నుంచి ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చింది. దీంతో జిల్లాలో ఉన్న ఆర్టిసి బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 68 శాతం నుంచి 82 శాతానికి పెరిగింది. దీనివల్ల బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. అనూహ్య రీతిలో రద్దీ పెరగడంతో టికెట్లు తీసుకుని ప్రయాణిస్తున్న వారు ఇక్కట్లు పడుతున్నారు. తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చాలా గ్రామాల్లో బస్సులు ఆపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బస్సు సర్వీస్ ప్రారంభమైన మొదటి రెండు బస్టాప్‌ల్లోనే బస్సు సీటింగ్ నిండిపోతోంది. దీంతో డ్రైవర్లు తర్వాత బస్టాప్‌ల వద్ద నిలపడం లేదు. ఫలితంగా ఉచిత బస్సు



ప్రయాణం కోసం ఎదురు చూసే మహిళలు, విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉచిత ప్రయాణానికి నోచుకోని గ్రామాలెన్నో

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి తెచ్చినప్పటికీ దానికి నోచుకోని గ్రామాలెన్నో జిల్లాలో వున్నాయి. గతంలో బస్సులు ఎక్కువగా తిరిగిన గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేకనో, ఆక్యుపెన్సీ రేషియో పడిపోయినందునో అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్ళే పరిస్థితి లేదు. సాలూరు నియోజకవర్గంలో పాచిపెంట మండల కేంద్రానికి పదేళ్ల క్రితం ప్రతి పది నిమిషాలకో బస్సు తిరుగుతుండేది. అయితే ఆటోల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఆర్టీసీ యాజమాన్యం పాచిపెంటకు బస్సులను తగ్గించింది. ఒకరోజులో రెండు, మూడు ట్రిప్‌లు నడపడంతో మహిళలు ఉచితంగా ప్రయాణానికి దూరమవుతున్నారు. అదే విధంగా జిల్లాలో కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, మక్కువ మండలాల్లోని అనేక గ్రామాలకు రోడ్లు బాగోలేదని ఆర్టీసీ యాజమాన్యం బస్సులను నిలిపివేసింది. గత పదేళ్ళుగా పాడైన రహదారులను నిర్మించకపోవడంతో అవి గోతులతో నిండిపోయాయి. ఫలితంగా బస్సులు నడపలేని పరిస్థితి ఆర్టీసీ యాజమాన్యానికి దాపురించింది.

అన్ని స్టాపుల్లో బస్సులు ఆపాలి

మహిళలు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఎంత రద్దీగా ఉన్నా అన్ని స్టాపుల వద్ద బస్సులను ఆపాలి. ఆపలేదనే ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటాం. స్త్రీ శక్తి పథకం అమలు తర్వాత జిల్లాలో ఆక్యుపెన్సీ రేషియో 68 శాతం నుంచి 82 శాతానికి పెరిగింది. విద్యుత్ బస్సులు త్వరలో మంజూరు కానున్నాయి.

వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజారవాణా అధికారి, పార్వతీపురం

మన్యం జిల్లాలో పరిస్థితి ఇదీ

జిల్లాలో సాలూరు, పార్వతీపురం, పాలకొండలో ఆర్‌టిసి డిపోలు ఉన్నాయి. వీటిలో 238 బస్సులు ఉన్నాయి. ఇందులో 185 బస్సులను స్త్రీ శక్తి పథకం కోసం వినియోగిస్తున్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. 80 శాతం బస్సులను మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కోసం వినియోగిస్తున్నారు. దీనివల్ల మిగిలిన ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. జిల్లాలో ఆక్యుపెన్సీ రేషియో 68 శాతం నుంచి 82 శాతానికి పెరిగినా గతంలో ఉన్న పాత బస్సులనే యాజమాన్యం వినియోగిస్తోంది. ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చిన తర్వాత జిల్లాలో ఆగస్టు నెలలో 8లక్షల 11వేల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి నట్లు అధికారులు చెబుతున్నారు. దీనివల్ల రూ.2.85 కోట్లు మహిళలకు ఆదా అయిందని తెలిపారు. అయితే ఈ పథకం అమలు చేసిన తర్వాత కూడా పాత బస్సులతోనే యాజమాన్యం నిర్వహించడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. దీనివల్ల బస్సుల్లో రద్దీ అసాధారణ రీతిలో పెరిగి సీట్ల కోసం సిగపట్లు పెట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొత్త బస్సులు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పేదల బతుకులు కూల్చే ప్రభుత్వం

- ముడుపుల కోసమే వైద్య కళాశాలల ప్రయివేటీకరణ
- చలో వైద్య కళాశాల కార్యక్రమంలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యే
- సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రి వద్ద బైఠాయింపు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలోని పేదల బతుకులు కూల్చే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. పది వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరించడానికి నిరసనగా వైసిపి రాష్ట్ర వ్యాప్తంగా చలో వైద్య కళాశాల ఆందోళనకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా వైసి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్తు రాజు ఆధ్వర్యాన శ్రీకాకుళం, మన్యం జిల్లాలకు చెందిన మాజీ మంత్రులు ధర్మాన కష్ణదాస్, డాక్టర్ సీదిరి అప్పలరాజు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ డిప్యూటీ సీఎంలు పుష్ప శ్రీవాణి, రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, వి.కళావతి, రెడ్డి శాంతి స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రి సమీపంలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని పరిశీలించారు. అంతకు ముందు మెయిన్ రోడ్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. అనంతరం జిల్లా కేంద్ర ఆసుపత్రి ఎదుట మండుటెండలో బైఠాయించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని పిపిపి విధానాన్ని సిఎం చంద్రబాబు నాయుడు అమలు చేయాలని చూస్తున్నారని అన్నారు. గతంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి ఒకేసారి 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేసి 2500 వైద్య సీట్లను పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారని చెప్పారు. తొలుత 5 ప్రభుత్వ వైద్య కళాశాలలను నెలకొల్పి 700 వైద్య సీట్లను అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. వెనుకబడిన గిరిజన ప్రాంతం మన్యం జిల్లా కావడంతో అక్కడ వైద్య కళాశాలకు రూ.600



పట్టణంలో ర్యాలీ చేస్తున్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యే, వైసిపి నేతలు



జిల్లా కేంద్రాసుపత్రి వద్ద బైఠాయించిన వైసిపి నేతలు

కోట్లు మంజూరు చేశారని చెప్పారు. మిగిలిన అన్ని వైద్య కళాశాలలకు రూ.500 కోట్లు చొప్పున నిధులు మంజూరు చేశారని తెలిపారు. నాలుగు సార్లు సిఎంగా పనిచేసిన అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు హయాంలో ఒక్క వైద్య కళాశాల కూడా మంజూరు చేసిన దాఖలాల్లేవని విమర్శించారు. ఇప్పుడు ప్రజారోగ్యాన్ని వ్యాపారం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. మాజీ డిప్యూటీ సిఎం పుష్ప శ్రీవాణి మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ముడుపుల కోసమే వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలని చూస్తోందన్నారు. నిధుల కొరత కారణంగా వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేస్తున్నట్లు చెప్పడం నిజం కాదన్నారు. 17 వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడానికి రూ.8వేల కోట్లు నాబార్డ్ నిధులు మంజూరు చేయించేందుకు అప్పటి సిఎం జగన్ జీవో జారీ చేశారని చెప్పారు. రూ.3వేల కోట్లతో 5వైద్య కళాశాలలను ఏర్పాటు చేసినట్లు పుష్ప శ్రీవాణి చెప్పారు. వైసిపి డాక్టర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ పది వైద్య కళాశాలలను ప్రయివేటుపరం చేయడం పై టిడిపి మంత్రులు, ఎమ్మెల్యేలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజల ఆస్తిని అమ్మేయడానికి సిఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. ప్రయివేటు వ్యాపారుల చేతుల్లో టిడిపి ప్రభుత్వం కీలుబొమ్మలా మారిందని విమర్శించారు. పార్వతీపురం మన్యం జిల్లా అత్యంత వెనుకబడిన ప్రాంతమని భావించి వైసిపి హయాంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలని మంజూరు చేశారని చెప్పారు. జిల్లాలో మెజారిటీ దళిత, గిరిజన విద్యార్థుల మేలు కోరి ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేశారని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రయివేటు పరం చేస్తుంటే జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి ఒక్క వైద్య కళాశాలను నిర్మించలేదని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మంత్రి శ్రీనివాసరావు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు మావుడి శ్రీనివాసరావు నాయుడు, కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

రక్తహీనత సమస్యలు లేకుండా చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. అలాగే విద్యార్థినుల్లో రక్తహీనత సమస్యలు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జియ్యమ్మవలస, కురుపాం మండలాల్లో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి విస్తృతంగా పర్యటించారు. తొలుత కురుపాంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, కాలేజీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థినికి తొమ్మిది పాయింట్ల కంటే రక్తం తక్కువ ఉండరాదన్నారు. క్యారెట్, మునగాకు, పోషకాలు కలిగిన ఆహారంతో మంచి ప్రయోజనం ఉన్నందున, వాటిపై దష్టి సారించాలన్నారు. వయసుకు తగిన బరువు, ఎత్తుతో పాటు ఆరోగ్యంగా ఉండాలంటే రక్తహీనత ఉండరాదని, రక్తహీనత సమస్యలున్న విద్యార్థినిలకు సరైన పౌష్టికాహారం అందించిన పిదప, మరోసారి హెమోగ్లోబిన్ టెస్ట్ చేయించాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు, విద్యా శాఖ అధికారులకు మార్గదర్శకాలను జారీచేశారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులకు త్వరగా హెచ్బీ పర్సెంటేజ్ పెరిగేలా చర్యలు తీసుకోవాలని కురుపాం సీహెచ్సీ వైద్యునికి ఫోన్ ద్వారా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కురుపాంలోని ఎపి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను కలెక్టర్ సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డిస్తూ, విద్యార్థులతో కలిసి భుజించి, ఆహార నాణ్యత ప్రమాణాలను రుచి చూశారు. విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని, అందుకు తగిన ప్రణాళికలు ఇప్పటినుంచే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ముందుగా జియ్యమ్మవలస మండలం చినమేరంగిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అంబులెన్సు ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. లాగ్ బుక్‌ను పరిశీలించి, అంబులెన్సులో ఉన్న పరికరాలు, ఎమర్జెన్సీ కిట్ తదితర వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రోగులకు సత్వర సేవలు అందించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. పాము, కుక్క కాటుకు గురైనవారు, జ్వరంతో బాధపడే చిన్న పిల్లలు, గర్భిణీల ఓపిని పరిశీలించిన కలెక్టర్ రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలు, భోజన సదుపాయాల గురించి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో మందుల కొరత ఉండరాదని, సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉద్బోదించారు. ఈ పర్యటనలో ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ జి.నాగభూషణరావు, సీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ డి.చైతన్య, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, కురుపాం ఆం.ప్ర.గిరిజన సంక్షేమ బాలికల రెసిడెన్సియల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.అనురాధ, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోండి

తమకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కలెక్టర్ పరిశీలన సమయంలో ఉపాధ్యాయులు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15-20 ఏళ్ల నుంచి అరకొర జీతంతో గిరిజన విద్యార్థులకు చదువులు చెబుతున్నామని, మెగా డిఎస్సీలో మా పోస్టులు కలిపి మాకు ఉపాధి లేకుండా చేసి మా కుటుంబాలను రోడ్డున పడేమయొద్దని వేడుకున్నారు. మమ్మల్ని కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మక దివాకర్, లక్ష్మీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

డోలీ తోవల్లో బిటి రోడ్లు ఏర్పాటు

గుమ్మలక్ష్మీపురం : మన్యం జిల్లాలో రహదారి సౌకర్యంలేని 264 డోలీ తోవల్లో అంబులెన్స్ సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి అన్నారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ పర్యటన అనంతరం శుక్రవారం రాత్రి స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రోడ్డు సౌకర్యం లేని డోలీమోత ఉన్న గ్రామాలకు బిటి రోడ్లు నిర్మించడం తక్షణ కర్తవ్యం పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుండి వచ్చే నిధులతో దశలవారీగా రోడ్డు నిర్మాణం చేపట్టి వైద్య సదుపాయం కల్పించే విధంగా ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. వచ్చే వారంలోనే రోడ్లు మంజూరు చేసి ఎస్టిమేట్లు పనులు ప్రారంభిస్తామన్నారు. తాడికొండ పంచాయతీలో కొండపైన ఉన్న మూడు గ్రామాలకు వెళ్లి పరిశీలించామన్నారు. మన్యం జిల్లాలో ప్రకృతి సుందరమైన దృశ్యాలు ఉన్నాయని, విభిన్నమైన అడవులు జలపాతాలు ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. తాడికొండ జలపాతం వద్ద సౌకర్యాలు కల్పించే విధంగా పనులు చేపడతామన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా యూరియా సమస్య లేదన్నారు. 21 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం కాగా 19మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందన్నారు. జీడి పిక్కల కొనుగోలుకు గిరిజన యువత ముందుకు వస్తే ప్రోత్సహిస్తామన్నారు. ఆసక్తిగా ఉన్న యువతకి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చి ఈ ప్రాంతంలో జీడి కొనుగోలు చేసే విధంగా ఉపాధి కల్పిస్తామని చెప్పారు. జిల్లాలో ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరించి మన్య ప్రాంతం అభివృద్ధికి కషి చేస్తానని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా అధికారులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

ప్రవేశాలు పెంచాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానిక ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. శుక్రవారం ఆయన ఐటిడిఎ పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకులాల ప్రిన్సిపాళ్లు, హాస్టళ్ల వెల్ఫేర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల శాతాన్ని పెంచాలన్నారు. ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులందరికీ పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేయాలన్నారు. ఇంకా పుస్తకాలు పూర్తిస్థాయిలో అందని పాఠశాలలకు వెంటనే పుస్తకాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాఠశాలల్లో ప్రతి గురువారం ఎఎన్ఎం, వైద్య సిబ్బంది పాఠశాలకు వచ్చి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. తల్లికి వందనం డబ్బులు ఇంకా జమకాని విద్యార్థులుంటే వారి సమస్యలను వెంటనే పరిష్కరించి డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల్లో తాగునీటిని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో నాణ్యత పరీక్షలు చేయించాలని సూచించారు. ఎటిడబ్ల్యుఒలు క్షేత్రస్థాయిలో పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పెడుతున్న భోజనం నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని అన్నారు. పదో తరగతి విద్యార్థులపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని, ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మరుగుదొడ్లను ప్రతి రోజూ శుభ్రపర్చాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ రామ్మోహనరావు, ఎటిడబ్ల్యుఒలు సూర్యం, మల్లికార్జునరావు, డిడి సెక్షన్ సూపరింటెండెంట్ అప్పారావు, పిఎంఆర్సీ జిసిడిఒ రాములమ్మ, సిఎంఒ చిరంజీవులు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న సబ్ కలెక్టర్ వైశాలి

ప్రతిఒక్కరికీ కుల ధ్రువపత్రాలు : సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి - సాలూరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ తమ పిల్లల చదువుల నిమిత్తమైనా తమ సొంత అవసరాలకైనా వారి కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడానికి ఎల్లప్పుడూ సంబంధిత అధికారులు సిద్ధంగా ఉంటారని పార్వతీపురం సబ్ కలెక్టర్ వైశాలి తెలిపారు. మండలంలోని మరిపల్లి పంచాయతీలో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ గతంలో ఈ గ్రామం నుంచి సుమారు 70మంది కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. సరైన పత్రాలను సమర్పించకపోవడంతో అప్పుడు ఇవ్వలేకపోయామని, కావున ఈ రోజు ఇక్కడ గ్రామసభ నిర్వహించి గ్రామస్తులు మధ్యన వారి కుల వివరాలు పూర్తిగా పరిశీలించి గ్రామ తీర్మానం ప్రకారం వారు ఏ కులానికి చెందినవారన్న ప్రజాభిప్రాయం ప్రకారం వారికి కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ నీలకంఠరావు, మండల సర్వేయర్, సర్పంచ్ తొత్తడి నారాయణమ్మ, ఎంపిటిసి సభ్యులు జన్ని సీతారాం, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, సచివాలయం సిబ్బంది, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షణ ఉండాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. రేగిడి, దొరజమ్ములో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను శుక్రవారం వైద్య సిబ్బందితో సందర్శించారు. ముందుగా సిక్ రూమ్ పరిశీలించి అక్కడ అనారోగ్యంతో ఉన్న విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య స్థితి, పొందుతున్న చికిత్సా వివరాలు రికార్డులో తనిఖీ చేశారు. ఏ ఆరోగ్య సమస్య, ప్రారంభమైన, కోలుకున్న తేదీలు, చికిత్సా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. సిక్ రూమ్‌లో మందులు, కాలపరిమితి గమనించారు. విద్యార్థుల హిమోగ్లోబిన్ పరీక్షల నివేదికలు పరిశీలించి రక్తహీనతగా గుర్తించిన విద్యార్థుల ఆరోగ స్తితి పరిశీలించారు. ఆర్.బి.ఎస్.కె స్క్రీనింగ్‌పై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు పలు ఆరోగ్య అంశాలపై ఫ్లిప్ చార్ట్ ఓ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి.ప్రవీణ్ కుమార్, హెచ్ఎం వి.స్వాతి, డెమో సన్యాసిరావు, వార్డెన్లు జోగిలత, వెంకటేశ్వర రావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ ఊరికే సాగునీరు కరువు

- రూ.65 లక్షలు ఎక్కడ ఖర్చు చేశారో?
- విఆర్ఎస్ పూర్తి ఆయకట్టుకు సాగు నీరందించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని వెంగళ రాయసాగర్ ప్రాజెక్టు కాలువ చైర్మన్ స్వగ్రామమైన తూరుమామిడికి సాగునీరు ఇవ్వలేకపోతే ఈ ప్రాజెక్టు పరిధిలోని మిగిలిన గ్రామాలకు ఏం సాగు నీరు కూటమి ప్రభుత్వం అందిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రశ్నించారు. మండలంలోని వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు పరిధిలో గల తూరుమామిడిలో ఆర్‌బిసిలో 19 ఎల్ కాలువను రైతులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ వెంగళరావు సాగర్ ప్రాజెక్టు పరిధిలో 24,700 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉండగా కేవలం 16 వేల ఎకరాలకు మాత్రమే అందుతుందన్నారు. ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నప్పటికీ కాలువలు మరమ్మతులు చేయకపోవడంతో రైతులకు సాగునీరందడంలే దన్నారు. తూరుమామిడి, శాంతిశ్వరం గ్రామాలకు ఆర్‌బిసిలో 19ఎల్, 18ఎల్ కాలువల పరిధిలో సుమారు 1000 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉన్నప్పటికీ సక్రమంగా నీరందడం లేదని అన్నారు. ప్రాజెక్ట్ చైర్మన్ తూరుమామిడికి చెందిన వారైనా, ఆయన గ్రామంలో కాలువ మరమ్మతులు చేయకపోవడంతో సాగునీరందని పరిస్థితి నెలకొందని విమర్శించారు. అలాగే ఈ కాలువలే కాకుండా ఎల్బీసీ, ఆర్ఎంసి పరిధిలో పూర్తిస్థాయిలో సాగునీరందడం లేదని ఎల్బీసీ పరిధిలో ఆక్విడేట్ పూర్తిగా నాశనమై ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ కొత్త ఆక్విడేట్ నిర్మించలేదని అన్నారు. దీనివలన 4వేల ఎకరాలకు సాగునీరందడం లేదని అన్నారు. సాగర్ ప్రాజెక్టు పరిధిలో సుమారు రూ.65 లక్షలు నిధులు అంచనాలు వేసి మంజూరు చేశారని సమాచార హక్కు చట్ట ప్రకారం అడిగితే ఇచ్చారని, ఆ నిధులు మరమ్మతులకు ఉపయోగిస్తే ఈపాటికి చివరి భూమి వరకు సాగునీరందేదని, మరి ఆ నిధులు ఖర్చు చేశారా లేదా, ఖర్చు చేస్తే ఎందుకు చివరి భూమికి నీరు వెళ్లడం లేదని అధికారులు ప్రశ్నించారు. ఇప్పటికైనా రూ.65 లక్షలు పూర్తిస్థాయిలో ఖర్చు చేసి కాలువల మరమ్మతులు చేసి చివరి ఆయకట్టు వరకు ఆర్బిసి ఆర్ఎంసి పరిధిలో సాగునీరందించాలని, లేకపోతే రైతులను కదిలించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తూరుమామిడి గ్రామ రైతులు పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలతో పేరుకుపోయిన విఆర్ఎస్ కాలువను పరిశీలిస్తున్న గంగునాయుడు



తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిని అందజేస్తున్న ఆటో కార్మికులు

ఆటో కార్మికులందరికీ వాహన మిత్ర ఇవ్వాలి

ప్రజాశక్తి - బలిజిపేట

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత మహిళలకు బస్సు పథకం వల్ల నష్టపోయిన తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆటో కార్మికులు శుక్రవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, బలిజిపేట ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మోహన్, హరి మాట్లాడుతూ వాహన మిత్ర పథకం కింద ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.30,000 ఇవ్వాలని, జి.ఒ. 21న వెంటనే రద్దు చేసి రవాణా రంగ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రవాణా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటో, రవాణా రంగంలో ఉండే కార్మికులు పథకాలు ఇవ్వాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆటో కార్మికుల సమస్యలపై చర్చించి న్యాయం చేసేలా ప్రభుత్వం ప్రకటన విడుదల చేయాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆటో కార్మికులు, వారి కుటుంబాలతో ఆందోళనకు సిద్ధపడతామని దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలు అభివృద్ధి

ప్రజాశక్తి - కొమరాడ

ఆది కర్మయోగి అభియాన్ పథకంతో గిరిజన గ్రామాలు శాతం అభివృద్ధి చెందుతాయని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. మండలంలోని ఉలిపిరిలో శుక్రవారం ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా ముందుగా వీధుల్లో ర్యాలీ చేసి, గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి అనంతరం గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి అనంతరం గ్రామసభలో మండల అధికారుల బృందం గుర్తించిన వివిధ పనులను రోడ్లు, కాలువలు, ప్రహరీ గోడలు, శ్మశాన వాటికలు, ఇళ్ల నిర్మాణాలు, పింఛన్లు తదితరమైన పనులను చదివి వినిపించారు. ఇంకా పెండింగ్ విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో సూపరైజర్ శారదంబ, సచివాలయ సిబ్బంది, ఎన్జీవో సంఘ సభ్యులు, నాయకులు, ఉద్యోగులు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 33/11కెవి, కుసిమి11కెవి ఫీడర్ నిర్వహణ పనులు శనివారం నిర్వహిస్తున్నామని ట్రాన్స్‌కో ఇఇ విష్ణుమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనుల వల్ల కుసిమి చుట్టు పక్కల గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. కావున వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాల్సిందిగా కోరారు.

వీరఘట్టం : స్థానిక ఉపకేంద్రం పరిధిలోని బిటివాడ ఫీడర్‌లో ఈనెల 20న విద్యుత్తు అంతరాయం ఏర్పడనున్నట్లు పాలకొండ ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.విష్ణుమూర్తి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. బిటివాడ ఫీడర్ పరిధిలో చెట్లు తొలగింపు, ఇతరత్రా పనులు చేస్తున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. కావున వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాల్సిందిగా కోరారు.

ఉత్సవాలకు రండి

ప్రజాశక్తి - పాలకొండ

ఈనెల 22 నుంచి కోట దుర్గమ్మ నవరాత్రి దసరా ఉత్సవాలు జరుగుతున్నాయని, ఈ ఉత్సవాలకు రావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆహ్వానం పలికారు. విజయవాడలో ఆయన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. రాష్ట్ర పండగగా ఉత్సవాలను గుర్తించాలని కోరారు దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

22న మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఈనెల 22న (సోమవారం) మెగా మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి తెలిపారు. ఈ మెడికల్ క్యాంపు కేవలం మహిళల కోసమేనని, ఇందులో మహిళలకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సికిల్ సెల్ స్క్రీనింగ్ మహిళలకు, గర్భిణీలకు గర్భధారణ సంరక్షణ, ఎఎన్‌సి తనిఖీలు, హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షలతో సహా గర్భధార సమయంలో ఆహార సంరక్షణపై కౌన్సిలింగ్, తల్లి, శిశు సంరక్షణ కార్డులు పంపిణీ, అవసరమైన కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆమె తెలిపారు.



మక్కువ- చెముడు రోడ్డుపక్కన ఉన్న భారీ గొయ్యి

ఇదిగో గొయ్యి ... ఆదమరిస్తే అంతే నోయి..

ప్రజాశక్తి -మక్కువ

మండలంలోని మక్కువ -చెముడు రహదారి మధ్యలో ఉన్న చర్చి సమీపంలో రహదారి అంచున భారీ గొయ్యి ఏర్పడాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల వైపు వరద నీరు ప్రవహించడంతో ఈ గోతులు ఏర్పడ్డాయి. వాహన చోదకులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి గోతులను పూర్తిగా చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

ప్రజాశక్తి - పాచిపెంట

కూటమి ప్రభుత్వం నిర్వహించిన సూపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాచిపెంట బిసి కాలనీలో ఇళ్లపై విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు మండల టిడిపి అధ్యక్షులు గూడెపు యుగంధర్, ఎఎంసి డైరెక్టర్ పూసర్ల నర్సింగరావు, ఎంపిటిసి సభ్యులు వల్లెడ ఉమామహేశ్వరరావు, అరకు వాణిజ్య విభాగం అధ్యక్షులు నడిమిల్లి మోహన్‌బాబుకు తెలిపారు. గత కొన్నేళ్లు ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని, ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని భయపడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన యుగంధర్, స్థానిక నాయకులు విద్యుత్ శాఖ ఎఇ దాసరి సింహాచలంకు సమస్య పరిష్కరించాలని తెలిపారు. దీంతో కాంట్రాక్టర్, ప్రధాన కార్యదర్శి మతల బలరాం పర్యవేక్షణలో కొత్తగా విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న వైర్లను తొలగించారు. ప్రమాదాన్ని తెలిసిన వెంటనే స్పందించి సమస్య పరిష్కరించడం పట్ల స్థానికులు విద్యుత్ శాఖ సిబ్బందికి, టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



పాచిపెంటలో విద్యుత్‌స్తంభాలు వేస్తున్న సిబ్బంది

పిల్లలకు పోషకాహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పిడి కనకదుర్గ

తల్లిదండ్రులు తమ పిల్లలకు పోషకాహారమిచ్చి ఛాంపియన్లుగా తీర్చిదిద్దాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కనకదుర్గ సూచించారు. రాష్ట్రీయ పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంట్లో ఆయిల్ ఫుడ్ వినియోగం తగ్గించాలని కోరారు. బయట దొరికే నూడిల్స్, సమోసా, బిర్యానీ వంటి ఆహార పదార్థాలకు పిల్లలను దూరంగా ఉంచాలన్నారు. 470 మంది థైరాయిడ్‌తో బాధపడుతున్నారన్నారు. స్వచ్ఛమైన పోషకాహారం అందించి పిల్లలను ఆరోగ్యంగా ఉంచాలని ఆమె కోరారు. కార్యక్రమంలో భద్రగిరి ఐసిడిఎస్ పిఒ విజయగౌరి, సూపర్వైజర్లు ఉన్నారు.

సీతంపేట : పోషణ మహ వారోత్సవాలు మండలంలోని కోతం, సారంగి, పులిపుట్టి, గొయిదిలో గల అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ సింహాలమ్మ మాట్లాడుతూ పోషణ్ మహ వారోత్సవాలు, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. తల్లులు పిల్లలకు పౌష్టికాహారం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నామన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందిన పౌష్టికాహారమైన బాలమృతం, గుడ్లు, పాలు వంటి వాటి గురించి తల్లులకు, గర్భిణీలకు అవగాహన కల్పించారు. ఎలాంటి పౌష్టికాహారం తీసుకుంటే ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుందో తెలియజేశారు. గర్భిణులు ఆకుకూరలు అధికంగా తీసుకోవాలన్నారు. పిండి వంటలు ప్రదర్శనలను పరిశీలించారు. చిన్నారులకు ఆటపాటలతో బోధించాలన్నారు. గర్భిణీలకు, తల్లులకు, పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలు అండగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు గౌరి, మిస్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని గుమడలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ్ మహ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతలు చేసి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి జి.సుగుణ కుమారి మాట్లాడుతూ జీవితంలోని ప్రతి దశలో పోషకాహారం గురించి విస్తృత అవగాహన పెంపొందించడానికి, దీన్ని ప్రతి ఏటా పోషణ్ మాహ్ (సెప్టెంబర్ 1 నుండి 30 వరకు), పోషణ్ పఖ్వాడా (మార్చి వర్షం)గా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోషణ్ అభియాన్ కింద, 'పంచ సూత్రాలు', పోషకాహారం, పారిశుధ్యం, పౌష్టికాహారం అందించడం, వినియోగించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి శిరీష, అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు రాజేశ్వరి, రాజీ, తదితర సిబ్బంది గర్భిణీలు, పాల్గొన్నారు.



పామాయిల్ తోటలో ఉన్న విద్యుత్ స్తంభాలు

పామాయిల్ మొక్కలను తొలగించిన విద్యుత్ సిబ్బంది

మాకు తెలియకుండా ఎలా తొలగిస్తారని రైతు ఆవేదన

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కందులపదం పంచాయతీ పరిధిలో గల బూస తౌడు సంబంధించిన పామాయిల్ తోటలో విద్యుత్తు హెచ్‌టి లైన్ స్తంభాలను వేసి చాలా ఏళు అయ్యింది. అవి కొంత కాలంగా ఒక పక్కకు ఒరిగి ఉండడంతో మొక్కలు వాటికి అడ్డుగా ఉన్నాయన్న నెపంతో విద్యుత్ అధికారులు వాటిని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. దీంతో తన పంట పోయి చాలా ఇబ్బందులకు గురవుతున్నానని రైతు తౌడు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఏడాదికి సుమారు లక్ష రూపాయల వరకు నష్టం కలుగుతుందని తెలిపారు. ఇదే విషయాన్ని గతంలో విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలియజేసినా కనీసం పట్టించుకోవటం లేదు. వీటిని తొలగించినప్పుడు కనీసం తనకు తెలియజేయడం లేదని, తనకు తెలపకుండా ఏవిధంగా వీటిని తొలగిస్తున్నారని రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేశానని ఆయన తెలిపారు. ప్రతి ఏటా తన పంటకు నష్టం కలిగి తనకు లక్షల రూపాయలు నష్టం కలుగుతుందని, ఈ నష్టాన్ని విద్యుత్ అధికారుల ద్వారా ఇప్పించాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

టిడ్కో ఇళ్లు తక్షణమే ఇవ్వాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

8 ఏళ్లు అవుతున్నా లబ్ధిదారుల చేతికి టిట్కో ఇళ్లు చేరలేదని, కాల పరిమితి సమీపించి, శిథిలావస్థకు చేరితే గానీ, టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు ఇచ్చేలా లేదని కాంగ్రెస్ నాయకులు ఎద్దేవా చేశారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు వి.దాలినాయుడు, కోలా కిరణ్ కుమార్, తీళ్ళ గౌరీశంకరరావు అడ్డాపుశీలలో గల టిడ్కో ఇళ్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు ఎనిమిది ఏళ్ల క్రితం టిడ్కో ఇళ్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు వైసిపి, కూటమి ప్రభుత్వాలు నిరాశ మిగిల్చాయన్నారు. టిడ్కో గృహాల విషయంలో వైసిపి, కూటమి ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. 2017లో అధికారంలో ఉన్న టిడిపి ప్రవేశపెట్టిన టిడ్కో గృహాలను ఇప్పటి వరకు లబ్ధిదారులకు అందకపోవడం బాధాకరమన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు ఇవ్వకుండా ఐదేళ్లు తాత్సారం చేశారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వమైన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అప్పగించాలని డిమాండ్ చేశారు. టిడ్కో గహాలు విషయంలో అధికారులకు, పాలకులకు చిత్తశుద్ధి లోపించిందన్నారు. తక్షణమే టిడ్కో గృహాలు విషయమై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి లబ్ధిదారులకు స్పష్టతనిచ్చి న్యాయం చేయాలన్నారు. దీనిపై కొత్తగా వచ్చిన జిల్లా కలెక్టర్ అయినా చర్యలు చేపట్టాలని కోరారు.



ప్రజారవాణా అధికారిని కలిసిన ఎపిఎస్ఆర్‌టిసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు

కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

ఆర్‌టిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తులసీరాం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఆర్టీసీ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, లేబర్ హాలిడేస్ అమలు చేయాలని ఎపిఎస్ఆర్‌టిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తులసీరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌టిసి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తున్నాయని, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడం లేదని, టెండర్లలో పేర్కొన్న వేతనాలు కూడా కార్మికులకు అందకుండా కోతలు విధిస్తున్నారని విమర్శించారు. మన్యం జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపోల్లోనూ ఇదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు పోరాడిన దగ్గర కనీస వేతనాలు చెల్లిస్తున్నారని, లేని దగ్గర వేతనాల్లో కోతలు పెడుతున్నారని తెలిపారు. పార్వతీపురం డిపో పరిధిలో అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలపై ఆందోళనలు చేసినప్పటికీ ఆ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించలేదన్నారు. అద్దె బస్సు యజమానులు కార్మికులకు చెల్లిస్తున్న వేతనాల్లో కోతలు విధిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి చర్యలను యూనియన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని తెలిపారు. కావున ఈ సమస్యలన్నిటిని పరిష్కరించాలని జిల్లా ప్రజా రవాణా అధికారితో చర్చలు జరిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ, సిఐటియు ప్రధాన కార్యదర్శి వై మన్మధరావు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు బంకురు సూరిబాబు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీచేస్తున్న డిఎస్‌పి రాంబాబు, వైద్యాధికారులు

రక్తం దానం చేసి ప్రాణదాతలు కండి : డిఎస్‌పి

ప్రజాశక్తి - పాలకొండ

రక్తం దానం చేసి ప్రాణదాతలు కావాలని డిఎస్‌పి ఎం.రాంబాబు అన్నారు. స్వస్త్ నారీ శక్తిపరివార్‌లో కార్యక్రమంలో భాగంగా రక్తదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డిఎస్‌పి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తం దానం చేయడం మంచిదన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి రక్తం దానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. దీనిపై ఎటువంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.చిరంజీవి, ఆర్ఎంఒ రవికుమార్ తదితరులున్నారు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 8నెలలుగా వండుతున్న మధ్యాహ్న భోజన కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు రెడ్డి మల్లేశ్వరమ్మతో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలేజీల్లో మొదలైన మధ్యాహ్న భోజన పథకం మంచి శుభ పరిణామని, అయితే కార్మికులకు నేటికి 8 నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. అలాగే బియ్యం, గుడ్లు ప్రభుత్వం ఇస్తుందని, మిగతా వంట సామాగ్రి బయట అప్పులు చేసి కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. ఎనిమిది నెలలగా అప్పులు చేసి వండుతున్నారని, దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే మధ్యాహ్న భోజన కార్మికులకు 8నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించి అన్ని విధాలా భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు జి.పార్వతి, ఎస్.గౌరి, ఇ.హేమలత పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దినోత్సవం

ప్రజాశక్తి - కురుపాం

దేశావ్యాప్తంగా జరుగుతున్న హిందీ పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా హిందీ దినోత్సవాలు నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయులు సంతోష్ కుమార్ పండా, అనురాధ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు పాటలు, నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లో హిందీ పట్ల గల భయాన్ని పోగొట్టి ఈ ప్రాంతం నుంచి పదుల సంఖ్యలో హిందీ ఉపాధ్యాయులను తయారు చేసి హిందీ వ్యాప్తికి విశేష కృషి చేసిన సంతోష్ కుమార్ పండాను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హిందీ ప్రాధాన్యత గురించి ప్రధానోపాధ్యాయులు తోట శంకర రావు వివరించారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - కురుపాం

మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డిఎంహెచ్‌ఒ ఎస్.భాస్కరరావు తెలిపారు. మండలంలోని గుమ్మ హెల్త్ వెల్నెస్ సెంటర్లో స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ ద్వారా ఉచిత వైద్యశిబిరం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య సేవలను మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. మహిళలే సమాజానికి పునాదులన్నారు. ప్రతి మహిళా తన ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉంటే అనారోగ్య సమస్యలు రాకుండా ముందే జాగ్రత్తలు తీసుకుంటారని పేర్కొన్నారు. అక్టోబర్ 2 వరకూ జరిగే ఈ వైద్య సేవల్లో మహిళలకు అన్ని పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. మందులు కూడా ఉచితంగానే ఇస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవాలని కోరారు. ప్రతి మహిళా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కౌశిక్, డాక్టర్ బి.మేఘన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని బూర్జ ఆయుర్వేదిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో శుక్రవారం స్వస్త్ నారీ శక్తి పరివార్ అభియాన్ ద్వారా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండలంలోని పెదంకలాం పిహెచ్‌సి వైద్యాధికారులు పి.రమ్య, సాయి శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరాలు ప్రత్యేకంగా మహిళల కోసం ఏర్పాటు చేశామన్నారు ఈ శిబిరాల ద్వారా మహిళల్లో ఉండే రక్తహీనత పోషక విలువలు, గర్భిణీలు అలాగే యుక్త వయసు గల మహిళల్లో అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేసి వారికి కావాల్సిన వైద్యం అందించి మందులు పంపిణీ చేస్తామన్నారు. కావున ప్రతి మహిళా ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేదిక వైద్యాధికారి టి.హేమాక్షి, వైద్యులు డాక్టర్ పి.సుశీల, డాక్టర్ మహేష్, డాక్టర్ వర్మ వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోనితాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న రోగులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మందులు పంపిణీ చేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కొమరాడ : స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తే ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని విక్రంపురం సర్పంచ్ శైలజ, మల్లి బాబు అన్నారు. మండలంలోని విక్రంపురంలో జన కళ్యాణ సమాఖ్య స్వచ్ఛంద సంస్థ, కరూర్ వైశ్యా బ్యాంకు వారి సహకారంతో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులచే పలువురు రోగులకు తనిఖీలు చేశారు. వైద్య శిబిరానికి విక్రంపురం, చినధీరుల, కుమ్మరిగుంట, కంభవలస పంచాయితీల నుంచి సుమారు 90 మంది వరకు నేత్ర సంబంధిత రోగులు వచ్చి తనిఖీలు చేసుకున్నారు. వీరిలో 34 మందిని కంటి ఆపరేషన్‌తో పాటు ఉచితంగా కళ్లద్దాలను ఇవ్వనున్నట్టు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది, జె.కె.ఎస్ సెక్రటరీ నిధిర్‌వర్గస్, తదితరులు పాల్గొన్నారు.



వీరఘట్టంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

300 మందికి వైద్య తనిఖీలు

వీరఘట్టం: మండలంలోని వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల చిన్నగోర కాలనీ, తెట్టంగిలో శుక్రవారం ఎస్ఎన్ఎస్ పిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యాధికారులు ఎం.సాయి కుమార్, ఎ.మానస, పి.గణేష్ , గౌతమ్ 300 మందికి వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, చిన్నారులు, బాలింతలు, రక్తపోటు, మధుమేహ, క్యాన్సర్, సికిల్ సెల్ తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంతకుమారి, సుభారతమని, ఇందిరా, లలిత కుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీ అభివృద్ధికి నిధులు కేటాయించండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నాయక్‌కు వినతిని అందజేస్తున్న ప్రిన్సిపల్ శ్రీవరం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్‌ను స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవరం కోరారు. శుక్రవారం ఆమె అమరావతిలో ఎంఎం నాయక్‌ను కలిసి డిగ్రీ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరుకు వినతిపత్రం అందించారు. కాలేజీని ఇంకా అభివృద్ధి చేయాలని, అదనపు తరగతి గదులు, మరికొన్ని ప్రయోగశాలలు, ఓపెన్ జిమ్ లాంటి సౌకర్యాలు కల్పించాలని గిరిజన శాఖ ప్రభుత్వ కార్యదర్శిని కోరినట్టు తెలిపారు. అందుకు ఆయన అనుకూలంగా స్పందించారని తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి విడత ఇప్పటి వరకు అన్ని గ్రూపులు కలిపి 142 ప్రవేశాలయ్యాయని తెలిపారు. ఇంకా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసిన వారు 15 మంది వరకు ఉన్నారని, వారి సీట్ల కేటాయింపునకు చిన్న లోపాలున్నందున ఇవ్వలేదని చెప్పారు. కళాశాలలో బోధన అనుభవం, ప్రతిభ గల అధ్యాపకులు చిత్తశుద్ధితో బోధిస్తున్నారని, విశాలమైన తరగతి గదులు, మంచి ల్యాబ్‌లు, కంప్యూటర్లు ఉన్నాయని తెలిపారు. ఇంకా 90 వరకు ఖాళీగా సీట్లు ఉన్నాయని, కళాశాలలో చేరదల్చిన వారు సెకండ్ ఫేజ్ లో అప్లై చేసుకోవాలని కోరారు.

రేగులపాడులో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని రేగులపాడులో శుక్రవారం స్థానిక పశు సంవర్ధక వైద్యాధికారి పి.చైతన్య శంకర్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి ఎస్.మన్మధరావు వైద్య శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. యదకురాని పశువులకు చికిత్స అందించడంతో పాటు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్నామని, వీటిని పాడి రైతులు సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎగ్జిక్యూటివ్ అధికారి డిఎల్‌డిఎ డాక్టర్ సిహెచ్ సత్య ప్రకాష్, పాలకొండ ఎడిఎ విహెచ్ డాక్టర్ పి మాణిక్యరావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రేగులపాడులోని ఆడ దూడ ఉత్పత్తి పథకంలో భాగంగా పశువులకు ఎస్ఎస్ఎస్ చేయడం జరిగిందన్నారు. పశువులకు ఆడ దూడ జన్మించిందని, దూడ రెండున్నర ఏళ్లకే ఏడు నెలలు చూలుతో ఉండడంతో పాడి రైతు ఆనందం వ్యక్తపర్చినట్లు స్థానిక పశు వైద్యాధికారి పి.చైతన్య శంకర్ తెలిపారు.

వెలిగితే ఆగవు...ఆగితే వెలగవు

ఇదీ వీధిదీపాల నిర్వహణ తీరు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంతో పాటు నడుకూరు, హుస్సేన్‌పురం, గడగమ్మ, తూడి, నీలానగరం తదితర గ్రామాల్లో వీధి దీపాలు పట్టపగలే వెలుగులు వెదజల్లుతున్నాయి. ఇవి వెలిగితే ఆగవు... ఆగితే వెలగవు అన్న పరిస్థితి నెలకొంది. విద్యుత్తును ఆదా చేయాలని పాలకులు, అధికారులు చెబుతున్నా మరోపక్క అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యుత్తు వృథాగా పోతుందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్తును ఆదా చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఆర్‌పి పున్నారావు

గుమ్మలక్ష్మీపురంలో సోషల్ ఆడిట్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

2024-25 సంవత్సరానికి సంబంధించి మండలం లోని 27 పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి విచారణ చేసి అవకతవకలను గుర్తించినట్లు ఎస్ఆర్‌పి పున్నం నాయుడు తెలిపారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించిన సోషల్ ఆడిటల్‌లో ఆయన మాట్లాడారు.ఉపాధి హామీ, హార్టికల్చర్, పంచాయతీరాజ్, ఐటిడిఎ ఇంజనీరింగ్ విభాగాల్లో జరిగిన వివిధ రకాలైన 2939 పనులకు సంబంధించి రూ.3 కోట్ల 8లక్షల 19 వేలు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. చెముడుగూడ లక్కగూడ, లుంబేసు, దుడ్డుఖల్లు, జర్న తదితర పంచాయతీల్లో ఉపాధి హామీ పనుల్లో మస్తర్లు దిద్దు బాటు, బినామీ పేర్లతో పనులు చేయించడం, ఒకే రేషన్ కార్డు మీద రెండు జాబ్ కార్డులు మంజూరు వంటి అవకతవకలు జరిగినట్లు తెలిపారు. మండలంలో 13,436 జాబ్ కార్డులు ఉండగా, ఇందులో 12,821 యాక్టివ్‌గా ఉన్నట్లు చెప్పారు. 11,724 జాబ్ కార్డులతో ఉపాధి పనులు చేసినట్లు తెలిపారు. 6330 మందికి వందరోజుల పని కల్పించామన్నారు. బీరుపాడులో రూ.1.38 లక్షలు, గొయ్యి పాకలో రూ.38 లక్షలు ఉపాధి పనుల అవకతవకలు జరిగినట్లు గుర్తించామన్నారు. దుడ్డుఖల్లు పంచాయతీలో చనిపోయిన వారి పేరు మీద రూ.3000 బిల్లు చేసినట్లు గుర్తించామన్నారు.